108 అంబులెన్స్ తనిఖీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని 108 అంబులెన్స్ వాహనాన్ని రంగారెడ్డి జిల్లా 108 కో ఆర్డినేటర్ రాజాబాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108 వాహనంలో సౌకర్యాలు పరిశీలించి రికార్డులో నమోదు చేశారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని అంబులెన్స్ వాహనాలను రొటీన్‌గా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం రాజేంద్రనగర్ వాహనాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఈ అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డుపై ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించాలన్నారు. తమ సిబ్బంది నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేస్తారన్నారు. అనంతరం దగ్గరలోని ఆస్పత్రికి తరలిస్తారని వివరించారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కార్పొరేటర్‌కు లేదు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా శాసన సభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని కొంత మంది కావాలనే ఆయనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి స్థాయిని మించి మాట్లాడుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. నిన్ను రెండు సార్లు కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రజలకు ముందు నువ్వు న్యాయం చేయాలన్నారు. ఎప్పుడు ఎమ్మెల్యే మీద మాట్లాడి పబ్బం గడుపుకోవడం తప్పించి ఇంకా ఏమి లేదన్నారు. ముందు డివిజన్‌లోని సమస్యల మీద దృష్టిపెడితే బాగుంటుందన్నారు. డివిజన్‌లో సమస్యలు బాగా ఉన్నాయని ముందు వాటిని పరిష్కరించి తరువాత ఎమ్మెల్యే గురించి మాట్లాడాలని సూచించారు. ఇలా ప్రతిసారి లేనిపోని ఆరోపణలు చేస్తే తాము చూస్తు ఊరుకోమని తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సరికొండ వెంకటేష్, ప్రేమ్‌గౌడ్, గట్టయ్య, బస శ్రీను, లక్ష్మారెడ్డి, అనిల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్స్‌పై ముగిసిన శిక్షణ

ఏజీవర్సిటీ: భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థలో మిల్లెట్స్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ వృద్ధిలో తాజా పురోగతులు అనే అంశంపై తెలంగాణ కేజీబీవీ11, 12వ తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర విద్యా అభియాన్ తెలంగాణ అదనపు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రాధారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మిల్లెట్‌ల ప్రాముఖ్యత, వాటి విలువ వృద్ధిపై అవగాహన కల్పించినందుకు ఐసీఎఆర్, ఐఐఎంఆర్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి మాట్లాడుతూ.. మిల్లెట్ల పోషక ఆరోగ్య ప్రయోజనాలను సమాజానికి చేరవేసే రాయబారులుగా పాఠశాల విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాస్, రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఐ సమావేశం విజయవంతం

మణికొండ: ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్(పీఎంఐ) దక్షిణాసియా సమావేశం-2025 శనివారం గౌలిదొడ్డిలోని అన్వయ కన్వెన్షన్‌లో విజయవంతం అయ్యింది. నిపుణులను ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ఈ సమావేశం శక్తివంతం చేసిందని మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ గోయల్ అన్నారు. 'ఎయిమ్ హై, అచీవ్ మోర్' ఏఐ థీమ్‌తో 1200 మంది ప్రతినిధులు, 20మంది వక్తలు ఇందులో పాల్గొన్నారని తెలిపారు. దక్షిణాసియా అంతటా ప్రాజెక్ట్ నిపుణులు, పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలు, విభిన్న సమూహం పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇందులో అభివృద్ధి చెందుతున్న ప్రాజెక్ట్ నిర్వహణ ల్యాండ్‌స్కేప్, భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న ప్రాజెక్ట్ విజయానికి ఏఐ ఆధారిత నైపుణ్యాల కీలక పాత్రపై చర్చలు జరిగాయన్నారు. పలు సెషన్ల వారీగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా రంగాల్లోని నిష్ణాతులు తమ ప్రాజెక్ట్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అనేక ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

మణికొండ: ఈనెల 17వ తేదీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు నుంచి అక్టోబర్ 2వ తేదీ మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిల వరకు 15 రోజుల పాటు సేవా పక్వాడ్ పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. శనివారం మణికొండ బీజేపీ కార్యాలయంలో సేవా పక్ష ఉత్సవాలపై నాయకులతో సమావేశం నిర్వహించి మున్సిపాలిటీకి ఇన్‌చార్జిలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 17వ తేదీన రక్తదాన శిబిరం, 18న చిత్రలేఖనం పోటీలు, 25వ తేదీన దీన్‌దయాల్ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటడం, 27వ తేదీన దివ్యాంగులకు సన్మానం చేయటం, 28న విశిష్ట సేవలు చేసిన వారిని సన్మానించటం, అక్టోబర్ 2న గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిల సందర్భంగా ఖాదీ వస్త్రాలు కొనుగోలుపై ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యలను పార్టీ నాయకులు సి. బీరప్ప, కె. శ్రీనివాస్‌రెడ్డిలను కన్వీనర్, కో కన్వీనర్‌లుగా నియమించారు. ఈ సమావేశంలో బాషా, అంజన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నివాసాల నడుమ

గోదాములతో దడ

- కొరవడిన కనీస రక్షణ చర్యలు
- తరచూ అగ్ని ప్రమాదాలు
- ఆందోళనలో పలు బస్తీల ప్రజానీకం
- పట్టించుకోని యాజమాన్యాలు
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసన



శాస్త్రిపురం: పలు బస్తీల్లోని నివాసాల నడుమ ఏర్పాటు చేసిన వివిధ గోదాములు, కంపెనీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గోదాముల్లో తరచూ జరుగుతున్న పలు ప్రమాదాలతో పరిసర ప్రాంతాల్లోని ప్రజానీకం ఎప్పుడు ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందోననే ఆందోళన వ్యక్తం చేస్తోంది.

◆ శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలోని బస్తీలలో పదుల సంఖ్యలో గోదాములు, కంపెనీలు ఉన్నాయి. వీటిలో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని పేదలే. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పొట్టచేత పట్టుకొని వచ్చిన ఎందరో కార్మికులు ఆయా సంస్థల్లో పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

◆ ఇంతటి ప్రాధాన్యత.. వందలాది మంది ప్రాణాలతో ముడి పడి ఉంది అక్కడి పరిస్థితి. అయితే వారి భద్రత కోసం వాటి నిర్వాహకులు కనీస రక్షణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇళ్ల మధ్య గోదాములను ఏర్పాటు చేసి పనులు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ 200 గజాల ఖాళీ స్థలాలు మొదలుకొని నుంచి 4000 వేల గజాల వరకు స్థలాలను అద్దెకు తీసుకుని పెద్దపెద్ద షెడ్లు నిర్మించి కంపెనీలు, గోదాములను నడిపిస్తున్నారు. ఆదాయమే పరమావధిగా నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల రక్షణ దైవాధీనంగా తయారుచేస్తోంది.

◆ నివాసాల మధ్య కంపెనీలు, గోదాములు ఉండకూడదని చెప్పినా పట్టించుకోవడం లేదని... అసలు ఆయా కంపెనీలలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని శాస్త్రీపురం డివిజన్‌కు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఎన్నో సార్లు గోదాములు, కంపెనీలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు విన్నవించినా వారి నుంచి కనీస స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీల వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే అన్నీ సక్రంగానే ఉన్నాయి ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అనే నిర్లక్ష్యపు సమాధానం వాటి నిర్వాహకుల నుంచి వస్తోందంటున్నారు.

◆ కర్రల కంపెనీలు, సోఫాల తయారీ కంపెనీలతో నిత్యం శబ్దం వస్తోందని దీనికి తోడుగా ఇందులో తయారైన వాటిని తరలించేందుకు పెద్దపెద్ద వాహనాలు వస్తుండటంతో తరచూ కాలనీలలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలువురు కంపెనీల నిర్వాహకులు సామాన్లను రహదారులు, ఫుట్‌పాత్‌లపై పెడుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అగ్నిప్రమాదం జరిగితే అంతే....

◆ బస్తీలలో నడుస్తున్న కంపెనీలలో పొరపాటున ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఊహించలేం అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 అడుగుల రోడ్ల సౌకర్యం ఉన్న ప్రాంతాలలో కంపెనీలు, గోదాములు ఉన్నాయని వాటిలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్ కూడా వెళ్ల లేదు. చాలా కంపెనీలలో కనీసం ఫైర్ అలారం పరికరాలు.. నివారణకు తగు ఏర్పాట్లు కూడా లేవనడం నిర్వివాదాంశం.

◆ కంపెనీలలో అగ్ని ప్రమాదం జరిగితే పక్కనే ఉన్న ఇళ్లకు మంటలు వ్యాపించే అవకాశం లేకపోలేదు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు ఎలాంటి ప్రమాదాలు సంభవించకముందే తగు ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శాస్త్రీపురం, సులేమాన్ నగర్ డివిజన్‌లలోని బస్తీలలో ఉన్న గోదాములు, కంపెనీలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెండు డివిజన్ల ప్రజలు కోరుతున్నారు.






శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ పరిధిలో నివాసాల నడుమ కొనసాగుతున్న గోదాములు, కంపెనీలు


ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు



మహాసభలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్‌లు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ , నాయకులు

మణికొండ: అంగన్‌వాడీలలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు నిర్వీర్యం చేసేలా ఇంగ్లిష్ మీడియం విద్య పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయటం తగదని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ మూడవ జిల్లా స్థాయి మహాసభను నిర్వహించారు. మంచిరేవుల చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అక్కడి నుంచి సభాప్రాంగణానికి ర్యాలీగా వెళ్లి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఐసీడీఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు జాతీయ విద్యావిధానం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. వారి సిఫారసులకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలికి అమలు చేయటం దారుణమన్నారు. ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ ఇంగ్లిష్ మీడియం విద్య పేరుతో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించటం సరైంది కాదన్నారు. ఈ విధానాన్ని వెనక్కి తీసుకుని ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలన్నారు. వలంటీర్లకు ఇచ్చే అదనపు వేతనాన్ని అంగన్‌వాడీ టీచర్‌లకు ఇవ్వాలని, టీచర్‌లను భర్తీ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించి అంగన్‌వాడీలను బలోపేతం చేయాలన్నారు.అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ సీనియర్ నాయకులు సులోచన, రాజ్యలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం .చంద్రమోహన్, అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, మండల నాయకులు ఎం.అశోక్, బి. శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, జనార్దన్‌రెడ్డి, మహిపాల్ యాదవ్, అంగన్‌వాడీ టీచర్స్ నాయకులు సుధారాణి, జ్యోతి, శోభారాణి, ఉషారాణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అలకాపూర్ అభివృద్ధికి కృషి



మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘం కమిటీ కలసికట్టుగా కృషి చేస్తుందని అధ్యక్షుడు వంశీ అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంజీ పార్కులో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌లో ఉన్న రోడ్ల ఆక్రమణలు, వీధి కుక్కలు, దోమలు, ఇంకుడు గుంతల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ మున్సిపాలిటీలోనే అతిపెద్ద టౌన్‌షిప్ కావటంతో అదే స్థాయిలో సమస్యలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలా వరకు పరిష్కరించామని, రాబోయే రోజుల్లో ప్రస్తుతం ఉన్న సమస్యలను మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

అత్తాపూర్ జెడ్‌పీహెచ్‌ఎస్‌లో సీసీ కెమెరాల ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పార్వతిల ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి ఆవుల శ్రీకాంత్‌రెడ్డి ఆర్థిక సహాయంతో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. వారం క్రితం కొంత మంది పోకిరీలు పాఠశాలలోని తరగతి గదుల కిటికీలను ధ్వంసం చేసిన విషయంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఆవురం శ్రీకాంత్‌రెడ్డి దాత సహకారంతో పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడం, వెంటనే ప్రారంభించడం చాలా గొప్ప విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ... పాఠశాల పూర్వ విద్యార్థులు స్పందించినప్పుడే పాఠశాలలో అభివృద్ధి చెందుతాయన్నారు. కాబట్టి ప్రతి పూర్వ విద్యార్థి ఒక బాధ్యతగా మీరు చదువుకున్న పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం ఆవురం శ్రీకాంత్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలుగా పని చేసి రిటైర్డ్ అయిన రేణుక పాఠశాల గేటు శిథిలావస్థలో ఉన్న విషయం తెలుసుకొని దాని మరమ్మతుల కోసం ఎనిమిది వేల రూపాయల విరాళంగా ఇవ్వడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో బెంబేలు




ఇందిరానగర్, హిమాయత్‌సాగర్‌లలో ఉన్న కోతులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోతుల బెడద రోజు రోజుకూ అధికం అవుతోంది. గతంలో ఈ ప్రాంతంలో ఒక్క కోతి కూడా కనిపించేది కాదు. ప్రస్తుతం కాలనీలు, బస్తీలలో కోతుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. ప్రజలు రోడ్లపై కనిపిస్తే చాలు వారిపై దాడులకు ఎగబడుతున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు కోతులను చూసి తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లపైకి ఎక్కి రేకులు, పెంకలను కోడుతూ శబ్దాన్ని సృష్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అలాగే ఒంటరిగా ఉన్న చిన్న పిల్లలపై సైతం దాడులు చేస్తున్నాయి. వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించే వారినీ వదలడం లేదు. వెంటనే అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కోతులను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించాలని వెడుకుంటున్నారు.

క్రీడా జోన్‌ను విభజించడం తగదు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ క్రీడా జోన్‌ను మూడు ముక్కలుగా చేయడాన్ని వ్యాయమ ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, గంగ నాయక్, జ్యోత్స్న, బాలస్వామి రెడ్డి, జ్యోతి, అరుంధతిలు తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం శివరాంపల్లిలోని పాఠశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ... రాజేంద్రనగర్ క్రీడా జోన్‌లో రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట్ మండలాలు ఉన్నాయన్నారు. శనివారం జిల్లా స్థాయిలో జరిగిన సమావేశంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని మూడు మండలాలను మూడు నియోజకవర్గాలకు కేటాయించారని ఆరోపించారు. శంషాబాద్ మండలానిన షాబాద్ మండలంలోకి, గండిపేట్ శంకర్‌పల్లిలోకి, రాజేంద్రనగర్‌ను మోయినాబాద్ లోకి మార్చడం దారుణమని తెలిపారు. రాజేంద్రనగర్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయని.. వాటిని అలాగే కొనసాగించాలని కోరారు. తాము సమావేశంలో నివేదించిప్పటికీ అలాగే కొందరు జోన్‌లను మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పాత జోన్‌ని కొనసాగించాలని కోరారు.

విద్యార్థులలో క్రమశిక్షణ పెంచాలి

మణికొండ: ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారని, వారికి విద్యతో పాటు క్రమశిక్షణను పెంచాలని వ్యాలీ ఓక్ కళాశాల డైరెక్టర్ నేతి వంశీధర్ అన్నారు. గండిపేట మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తారామతి బారాదరిలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తూ మండల పరిధిలో రాణిస్తున్నాయన్నారు. తమ వ్యాలీ ఓక్ కళాశాల 2019లో మణికొండలో ప్రారంభించి నన్‌సిటీ, హఫీజ్‌గూడలో బ్రాంచిలను ప్రారంభించామన్నారు. 1600 మంది విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కామర్స్ వింగ్‌లో కాలేజీ ఆఫ్ మానేజ్‌మెంట్ సైన్సెస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు.

సీబీఐటీకి ఐఎస్‌ఓ సర్టిఫికేషన్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను అందుకున్న సీబీఐటీ ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలకు ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (ఈఓఎంఎస్)లో ఐఎస్‌ఓ 21001: 2018 సర్టిఫికేషన్ పొందిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన సమావేశంలో సర్టిఫికెట్‌ను అధికారికంగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విద్య, విద్యార్థి కేంద్రీకృత బోధనకు సీబీఐటీ ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ గుర్తింపు దక్కిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు, నిరంతర అభివృద్ధికి, విద్యారంగంలో శ్రేష్టతకు సీబీఐటీ కట్టుబడి ఉందన్నారు. ఈ విజయం తమ సమష్టికృషికి నిదర్శనమని, దాని సాధనకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్టిఫికెట్‌ను అందించిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివయ్య మాట్లాడుతూ... సీబీఐటీ బలమైన విద్యావిధానాలను, నిరంతర అభివృద్ధికి ఉన్న నిబద్ధత అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఐక్యూఏసీ ప్రొఫెసర్ ఎన్‌వీ కోటేశ్వర్ రావు, ఐఎస్‌ఓ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.రవికుమార్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీ సమావేశంలో మాజీ కౌన్సిలర్ దౌర్జన్యం

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు



కాలనీవాసిపై దాడికి యత్నించిన కౌన్సిలర్



మాజీ కౌన్సిలర్ దాడిలో గాయపడిన రాజ్‌కుమార్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవెంకటేశ్వర కాలనీ కార్యవర్గంలో చీలికలు వచ్చాయి. దాంతో మరో వర్గం కొత్తగా కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నుకునే పనిలో ఉన్నారు. ఆ విషయం తెలిసి ఇప్పటికే కొనసాగుతున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి శనివారం కాలనీలో సర్వసభ్య సమావేశం పెట్టారు. అందులో కొంతకాలంగా కాలనీలో జరిగిన అవినీతి, వసూళ్లపై ప్రజలు నిలదీశారు. అనంతరం మాట్లాడిన మాజీ కౌన్సిలర్ బి.పద్మారావు తనపై ఓ వాట్సాప్ గ్రూప్‌లో వ్యతిరేకంగా పోస్టులు ఎవరు పెట్టారని గద్దించారు. దాంతో సమాదానం చెబుతున్న ఓ వ్యక్తిపైకి బూతులు తిడుతూ కొట్టేందుకు వెళ్లగా చుట్టూరా ఉన్న వారు అడ్డుకున్నారు. అయినా తగ్గని ఆయన మరింత రెచ్చిపోయి కుర్చీతో దాడికి యత్నించటంతో అది తప్పించుకునే క్రమంలో రాజ్‌కుమార్ పక్కనే ఉన్న రాయిపై పడటంతో తలకు తీవ్ర గాయం అయ్యింది. అయినా తగ్గని కౌన్సిలర్‌తో పాటు అతని అనుచరులు మరో మారు దాడికి యత్నించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి ఆందోళనను సద్దుమణిగించారు. ఈ సందర్భంగా గాయాలపాలైన రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కాలనీలో అక్రమభవనాల వద్ద, దేవాలయం నిర్మాణం పేరుతో రూ.2కోట్ల వరకు వసూళ్లకు పాల్పడ్డారని ఇది ప్రశ్నిస్తున్నందుకే తమ వర్గంపై దాడికి యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతానని కాలనీవాసులను మాజీ కౌన్సిలర్ కొంత కాలంగా బెదిరిస్తున్నాడన్నారు. అనంతరం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.500 కోట్ల విలువ చేసే

ప్రభుత్వ భూమి స్వాధీనం

- సాతంరాయి సర్వేనంబర్-17లో 12 ఎకరాలకు ఫెన్సింగ్ వేసిన హైడ్రా
- పలు ఆక్రమణల తొలగింపు
- ఇంటర్మీడియట్ బోర్డుకు కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- పలు కేసులతో కోర్టు వివాదాల్లో ఉన్న భూమి




ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

శంషాబాద్: శంషాబాద్ పట్టణ పరిధిలో అత్యంత ఖరీదైన సుమారు రూ. 500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనంలోకి తీసుకుని చుట్టూ ఫెన్సింగ్ వేశారు. పట్టణంలోని సాతంరాయి రెవిన్యూ పరిధిలోని సర్వేనంబరు 17లో ఉన్న 12 ఎకరాల భూమిని ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించిన అప్పటి సర్కారు దానిని ఇంటర్మీడియట్ బోర్డుకు కేటాయించింది. ఆ తర్వాత మరుసటి ఏడాది 2012 కొందరు వ్యక్తులు పైగా భూములుగా పేర్కొంటు కోర్టుకెక్కారు. ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీతోపాటు సాతంరాయి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి తమ పూర్వీకులు వ్యవసాయం చేసిన భూమిగా పేర్కొంటున్నారు. సంబంధిత భూముల్లో కోర్టుకు సంబంధించిన వివరాలను పొందుపరుస్తూ బోర్డులు కూడా పాతారు. దీంతో ఈ భూములు కాస్తా దశాబ్దకాలంగా వివాదాస్పద స్థితిలో ఉన్నాయి. ఇటీవల సంబంధిత భూముల్లో నిర్మాణాలు చేసేందుకు పాల్పడుతున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డుకు సంబంధిత స్థలాన్ని పరిరక్షించాలంటు హైడ్రాను కోరింది. దీంతో హైడ్రా రెవిన్యూ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి శంషాబాద్ రెవిన్యూ పరిధిలో పైగా భూములు లేవని, సంబంధిత భూములను గతంలో వ్యవసాయం చేసినట్లుగా పేర్కొంటున్నప్పటికీ అది వ్యవసాయానికి అనుకూలమైన భూమి కాదని నిర్ధారించుకున్నారు. కన్‌స్ట్రక్షన్ కంపెనీపై కూడా అనేక భూ వివాదాలున్నట్లుగా నిర్ధారించుకున్న హైడ్రా సాతంరాయిలోని సర్వేనంబరు-17లోని 12ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారించుకున్నారు.

బోర్డులు తొలగించి...

◆ భూమిలో తమవిగా పేర్కొంటూ కోర్టుకు సంబంధించిన కేసుల బోర్డులు పాతిన బోర్డులను అధికారులు తొలగించారు. అదే విధంగా ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న ప్రహరీని కూడా కూల్చివేశారు. పాశంబడ్డ వైపు ఉన్న ఓ గదితో పాటు పరిసర ప్రాంతాలన్నింటినీ చదును చేశారు. ప్రభుత్వ భూమిలో ఉన్న ఆలయాలు, మసీదు ప్రార్థన మందిరాన్ని వదిలేసి చుట్టు ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ బోర్డులు పాతారు. ఇదిలా ఉండగా... స్థానికంగా ఉండే గిరిజనలు తమ ఇంట్లో కార్యాలకు ప్రభుత్వ స్థలాన్ని వదిలి వేయాలని అధికారులతో గొడవకు దిగారు. తమ ఆధీనంలో ఉన్నందుకే ప్రభుత్వ భూమి ఇన్ని రోజులు ఉందన్నారు. అధికారులు తమకు శుభకార్యాలు జరుపుకొనేందుకు కొంత స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.



సాతంరాయిలోని ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయిస్తున్న హైడ్రా అధికారులు